

## పదేండ్లు ప్రశాంత తెలంగాణ



తెలంగాణ ఈ పదేండ్లలో ఉన్నంత ప్రశాంతంగా పూర్తి ఆత్మవిశ్వాసంతో ఎప్పుడూలేదు. అంతకుముందు ఒక అలజడి.. హింస ఉండేది. కానీ, అవన్నీపోయి మంచి బతుకు బతుకుతం అనే ఆశ కలిగింది. వ్యవసాయంలో ఒక జీవకళ వచ్చింది. గతంలో ఎప్పుడూ తెలంగాణ సెలెబ్రిటీ కాదు.. ఇక ఎప్పటికీ సెలెబ్రిటీయే. ఇవ్వాళ కిన్నెర మొగిలయ్య, గడ్డం రామస్వామి, సకిని రామచంద్రయ్య.. ఇట్లా అనేక మంది సెలెబ్రిటీలుగా కనిపిస్తున్నరు. బీఆర్ఎస్ రూపంలో స్థిరమైన ప్రభుత్వం ఉండటం వల్ల తెలంగాణ పదేండ్లు ప్రశాంతంగా ఉన్నది. తెలంగాణ ఎప్పుడూ ప్రగతిశీలంగానే ఉన్నది.

• **దేశపతి శ్రీనివాస్,** ప్రముఖ కవి, ఎమ్మెల్సీ

## అగ్రహీరోలూ పలకవలసిందే



ఆవిర్భవించక ముందు తెలంగాణ భాషను జోకర్లకు, విలన్లకు పెట్టారు. విలన్లు కూడా టాప్ రేంజ్ వాళ్లుకారు.. ఏదో గల్లీ విలన్లు... జోకర్ టైప్ విలన్లు. కానీ, ఇవాళ తెలంగాణ భాష చిరంజీవి లాంటి అగ్రహీరోలు మాట్లాడాల్సిన భాషగా అనివార్యమైంది. తెలంగాణ నేల మీద పుట్టి, ఈ సంస్కృతి, సంప్రదాయాలతో సినిమాలు (బలగం మొదలైన) తీయటం వేరు. తెలంగాణేతర హీరోలు... డైరెక్టర్లు అందరూ తెలంగాణ యాసను అంగీకరించటం వేరు. ఇది తెలంగాణ విజయమే.

• **చిమ్మని మనోహర్,** సినీ దర్శకుడు



## పోగుబంధంతో పేగుబంధం



వరంగల్‌లో వందల ఎకరాలు పత్తి సాగు అయినపుడు ఆజంజాహీ మిల్లు స్థాపన జరిగింది. కానీ, పత్తి సాగు లక్షల ఎకరాలకు చేరేనాటికి అది మూతపడింది. ఫలితంగా వేలాది మంది చేనేత కార్మికులు పొట్టచేత పట్టుకొని ముంబయి, సూరత్, భీవండి తదితర ప్రాంతాలకు వలసపోవాల్సిన దుస్థితి నెలకొంది. అందుకే రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఉపాధి కోసం ప్రాంతబంధాన్ని తెంచుకొని పోయినవారిని ‘పోగు’బంధంతో తిరిగి పేగుబంధానికి దగ్గరి చేయాలనే దూరదృష్టితోనే ‘ఫాం టు ఫ్యాషన్’ ట్యాగ్‌లైన్‌తో అదే గడ్డమీద 2వేల ఎకరాల్లో ‘కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కు’ నిర్మాణం చేపట్టింది కేసీఆర్ ప్రభుత్వం. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కేసీర్ కంకణం కట్టుకున్నారన్న విషయం ఈ ఒక్క ఉదాహరణతో బోధపడుతుంది.

